సాక్షి
సిద్దిపేట
సోమవారం । 18 । మార్చి । 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్: సోమవారం (సాయంత్రం) 6:32

సహర్: మంగళవారం (ఉదయం) 5:00

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో 5,319 కేసులు పరిష్కారం


సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 5,319 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారమైనట్లు సీపీ అనురాధ ఆదివారం తెలిపారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదై ఎంవీ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వంటి కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. టార్గెట్‌కు మించి కేసులను పరిష్కరించేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆమె అభినందించారు.

కురుమలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

సిద్దిపేటకమాన్: కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా కురుమ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాములు ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మహిళా దినోత్సవ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెజార్టీ జనాభా ఉన్న కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తేనే న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కురిసిన జల్లులు


దుబ్బాకలో చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో శనివారం అర్ధరాత్రి చిరుజల్లులు కురిశాయి. కొద్ది రోజులుగా వేసవి తాపంతో ఉక్కిరిబిక్కిరికి గురవుతున్న ప్రజలకు చిరు జల్లులు ఉపశమనం కల్గించాయి. అలాగే పొట్ట దశలో ఉన్న వరిపంటలకు వర్షం ఊరటనిచ్చింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం ఓ మోస్తరుగా కురవడంతో రోడ్డు పక్కల గుంతల్లో వర్షపు నీరు నిలిచింది.

గాలి వానకు కూలిన వృక్షం

దుబ్బాక: పట్టణంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన గాలి వానకు మహా వృక్షం కూలిపోయింది. అర్ధరాత్రి వేళ కావడం.. ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉదయన్నే అక్కడకి చేరుకుని జేసీబీ సహాయంతో చెట్టును రోడ్డు పై నుంచి తొలగించారు.

ఏసయ్యా.. కరుణించు


ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెండు పర్యాయాలు ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు దైవ సందేశమిచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే చర్చి కంపౌండ్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మోడరేటర్ కమిషనర్ రెవరెండ్ పద్మారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చర్చి నిర్మించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, బైబిల్ హౌస్, షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు 180 గదులను యాత్రికుల వసతి కోసం నిర్మించేందుకు శంకుస్థాపన చేశామని తెలిపారు.

లౌకికవాదులను గెలిపించండి


మాట్లాడుతున్న చుక్క రాములు

మెదక్ కలెక్టరేట్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మతోన్మాద శక్తులకు ఓట్లు వేయకుండా లౌకిక శక్తులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. ఆదివారం కేవల్ కిషన్ భవన్‌లో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని లూటీ చేస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సమ్మ, మహేందర్‌రెడ్డి, మల్లేశం, బస్వరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, నాయకులు అజయ్, సత్యం పాల్గొన్నారు.

విజయీభవ..

విద్యార్థి జీవితంలో పదో తరగతి మొదటి మెట్టు. ఈ ఫలితాలే వారి భవిష్యత్‌కు బాటలు చూపుతాయి. భయం వీడితే జయం మనదే. విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని విద్యాధికారులు సూచిస్తున్నారు. టెన్త్ వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ఏప్రిల్ 2వరకు జరుగనున్నాయి. ఈసారి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచేలా విద్యాధికారులు, ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేశారు. ఇక పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడమే తరువాయి.

- 'పది' పరీక్షలు నేటి నుంచే..
- వచ్చేనెల 2 వరకు ఎగ్జామ్స్
- సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- నిమిషం నిబంధన లేదు
- ప్రతి సెంటర్ సీసీ కెమెరా పర్యవేక్షణలో..


పరీక్షా కేంద్రాల్లో నంబర్లు వేస్తున్న అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 371 పాఠశాలల నుంచి 7,036 మంది బాలురు, 6,951 మంది బాలికలు, మొత్తం 13,987 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే ఒకేషనల్‌లో 1,661 మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 20 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున 789 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. పరీక్షల నిర్వహణ కోసం 23 స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. 46 కస్టోడియన్లతో పాటు 80 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 80 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. వీరితో పాటుగా ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 18 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఏడుగురు రూట్ ఆఫీసర్లను సైతం నియమించారు. ఇప్పటికే పరీక్ష పేపరులను 23 పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. అదేవిధంగా విద్యార్థులు పరీక్షలు రాయగానే వారి జవాబుపత్రాలు నేరుగా పోస్టాఫీస్‌లకు చేరుతాయి. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌లకు మాత్రమే వేరు వేరుగా పరీక్షలు నిర్వహిస్తారు. మిగతా సబ్జెక్ట్‌లకు ఒకే పేపర్ ఉంటుంది.

జిల్లా వివరాలు

విద్యార్థులు	13,987
పరీక్షా కేంద్రాలు	80
ఇన్విజిలేటర్లు	789
కస్టోడియన్స్	46
సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు	23
రూట్ ఆఫీసర్లు	7

విద్యార్థులూ.. ఆల్ ది బెస్ట్



పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు విద్యార్థులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. అన్ని పాఠశాలల్లో 100 శాతం రిజల్ట్ వచ్చే విధంగా విద్యార్థులు రాణించాలన్నారు. మీ అమ్మ నాన్నల ఆశయాలను నెరవేర్చాలన్నారు. మంచి మార్కులు సాధించిన వారు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు పొంది ఉన్నత విద్య చదువుతున్నారన్నారు. విద్యార్థులందరూ ఏకాగ్రతతో పరీక్షలు రాసి అద్భుతమైన ఫలితాలు సాధించాలని హరీశ్‌రావు కోరారు.

పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల కోసం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో పాటు, తాగు నీరు మౌలిక వసతులు కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి, సూపరింటెండెంట్ల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష సమయం ప్రారంభమైన 5నిముషాల వరకు విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతిస్తారు. పరీక్షలు ముగిసే వరకు జిల్లా అదనపు పరీక్షల అధికారి లక్ష్మయ్య (99088 73455) విద్యార్థులకు, విద్యార్థుల తల్లి దండ్రులకు వచ్చే సందేహాలను నివృత్తి చేసేందుకు అందుబాటులో ఉంటారు. ఒక్క నిముషం ఆలస్యం నిబంధన ఈ పరీక్షలకు లేదు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అందువల్ల విద్యార్థులు పరీక్షలను ప్రశాంత వాతావరణంలో రాయవచ్చు.


సీసీ కెమెరా పర్యవేక్షణ

ఆత్మవిశ్వాసంతో రాయండి



టెన్త్ పరీక్షల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశాం. పరీక్షా కేంద్రాల వద్ద అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాం. నిమిషం నిబంధన లేదు. జిల్లాలో మొత్తంగా 13,987 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి.

–శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

నాచగిరిలో భక్తుల సందడి

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వారాంతపు సెలవురోజు కావడంతో ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. హరిద్రనది వాగులో పుణ్య స్నానాలాచరించారు. తమ ఇష్టదైవం నాచగిరీశుని సన్నిధిలో సత్యదేవుని వ్రతాలు, స్వామివారికి అభిషేకం, కల్యాణాలు జరిపించారు. గర్భగుడిలో శ్రీలక్ష్మీనృసింహస్వామివారిని దర్శించుకుని తరించారు. వ్రతాది పూజలతో క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం అలుముకున్నది. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదివారం 15 సత్యదేవుని వ్రతాలు, 4 కల్యాణాలు జరిగినట్లు ఈఓ తెలిపారు.


భక్తులతో కిక్కిరిసిన నాచగిరి క్యూలైన్, విశేషాలంకరణలో లక్ష్మీనృసింహస్వామివారు, అమ్మవారు

నామినేటెడ్ కల.. నెరవేరిన వేళ

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాకు రెండు నామినేటెడ్ పదవులు వరించాయి. ఆదివారం ఈ మేరకు ప్రభుత్వం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. జహీరాబాద్ ఎంపీపీ అధ్యక్షుడు ఎస్.గిరిధర్‌రెడ్డి రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి టీఎస్ఐఐసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇరువురు పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి ఈ పదవులను కట్టబెట్టారు. జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు ఉండడంతో ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండాలని, పార్టీకి చెందిన వ్యక్తికి ప్రొటోకాల్ సమస్య రాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఇరువురు సీనియర్లకు పదవులు ఇచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్, యువజన, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఎన్.గిరిధర్‌రెడ్డిని పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మేల్కొంటేనే.. మేలైన విత్తనం

- విత్తన ప్రాసెసింగ్‌లో నిఘా తప్పనిసరి
- పలు కంపెనీలకు అడ్డాగా గజ్వేల్
- గతంలో లోపాలు బట్టబయలు
- వ్యవసాయ, పోలీసు శాఖ అప్రమత్తత అవశ్యం
- మరికొద్ది రోజుల్లో సీజన్ ప్రారంభం

విత్తన ప్రాసెసింగ్‌లో జిల్లా ప్రధానంగా మారింది. రాష్ట్రంలోని హయత్‌నగర్, మేడ్చల్, ఆర్మూరు, భూత్పూరు తదితర ప్రాంతాల తర్వాత గజ్వేల్ సైతం కేంద్రంగా నిలిచింది. గతంలో ఇక్కడ జరిగిన టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీల్లో అక్రమాలు బయటపడ్డాయి. మరికొద్ది రోజుల్లో సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా ఈసారి ఆ పరిస్థితి రాకుండా వ్యవసాయ, పోలీసు శాఖలు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. దీనిద్వారానే నాణ్యమైన విత్తనం మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంది.

గజ్వేల్: జిల్లాలో గజ్వేల్ విత్తన ప్రాసెసింగ్ ప్రధాన కేంద్రంగా మారింది. ప్రత్యేకించి ములుగు, వర్గల్, మర్కూక్, గజ్వేల్ మండలాలు విత్తన కంపెనీలకు అడ్డాగా మారాయి. సిద్దిపేటలోనూ కంపెనీలు వస్తున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో 30కిపైగా కంపెనీలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. నగరానికి సమీపంలో ఉండటం వల్ల వనరుల లభ్యత సులభంగా మారి...ఇక్కడ కంపెనీలను ఏర్పాటు చేయడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. దీనివల్ల రాష్ట్రంలోని పలు ప్రాంతాలుగా దీటుగా విత్తన ప్రాసెసింగ్, ప్యాకింగ్ జరుగుతోంది. కానీ ప్రాసెసింగ్ సక్రమంగా చేయకుండా, నాణ్యతా పరీక్షలతో ప్రమేయం లేకుండా విత్తనాలను మార్కెట్‌లోకి వదలడం, రిజక్ట్ అయిన విత్తనాలను తిరిగి ప్యాకింగ్ చేయాలనుకోవడం వంటి అక్రమాలు గతంలో వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే ఈసారైనా విత్తన ప్రాసెసింగ్‌పై పర్యవేక్షణను మరింత పకడ్బందీగా చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రాసెసింగ్ విధానం ఇదీ..

వరికి సంబంధించి మొదటగా పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తలు బ్రీడర్ సీడ్‌ను తయారు చేస్తారు. దీనిని ఎంపిక చేసిన రైతుల పొలాల్లో ఫౌండేషన్ సీడ్‌గా ఉత్పత్తి చేస్తారు. ఈ ఫౌండేషన్ సీడ్‌ను మరి కొంత మంది రైతుల పొలాల్లో విత్తనోత్పత్తి కోసం వేస్తారు. ఇలా వచ్చిన విత్తనమే సర్టిఫైడ్ లేదా ట్రూత్‌ఫుల్ లేబుల్ సీడ్‌గా రైతుల వద్ద విత్తనోత్పత్తి కంపెనీలు సేకరిస్తాయి. కంపెనీల్లో క్లీనింగ్, గ్రేడింగ్ చేసిన తర్వాత ప్యాకింగ్ పూర్తి చేసి తమ బ్రాండ్ పేరిట మార్కెట్‌లోకి విడుదల చేస్తాయి. ప్యాకింగ్ క్రమంలో విత్తన కంపెనీలు స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. మొక్కజొన్న విత్తనాలకు సంబంధించి ఆడ, మగ విత్తనాన్ని సంకరణం చేసి వచ్చే కంకులను కంపెనీలు సేకరించి... తమ కంపెనీల్లో వాటిని వలిచి క్లీనింగ్, గ్రేడింగ్ చేసిన తర్వాత ప్యాకింగ్ చేస్తాయి. పత్తి విత్తనాలకు సంబంధించి ఆడ, మగ విత్తనాన్ని సంకరణం చేయడం ద్వారా వచ్చే విత్తనాలను సేకరించి కంపెనీలు వాటిపై ఉండే దూదిని యాసిడ్ ద్వారా శుద్ధి చేసి తీసేస్తాయి. ఆ తర్వాత ప్యాకింగ్ చేసి మార్కెట్లోకి విడుదల చేస్తాయి. కానీ ప్రాసెసింగ్ సక్రమంగా జరగటం లేదనే వాదన వినపడుతోంది. రిజక్ట్ అయిన విత్తనాలను గుట్టుచప్పుడు కాకుండా మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో జరిగిన అక్రమాలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.

గతంలో ఇలా...

2021 జూన్ నెలలో ములుగు మండలంలోని ఓ కంపెనీలో నాణ్యతాప్రమాణాలను తనిఖీ చేయకుండానే మార్కెట్‌లోకి విడుదల చేయాలనుకున్న 2,384 క్వింటాళ్ల వరి విత్తనాలను అధికారులు పట్టుకున్నారు. ఇది జరిగిన కొద్ది రోజులకే ఇదే మండలంలోని మరో ఓ విత్తన కంపెనీలో రిజక్ట్ అయిన స్టాక్ వివరాలను ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండానే కంపెనీలో స్టాక్‌తోపాటే నిల్వ చేశారనే కారణంగా నోటీసులు ఇచ్చారు. 2022లోనూ వ్యవసాయశాఖ విస్తృతంగా తనిఖీలు చేపట్టి పలు కంపెనీలకు నోటీసులు ఇచ్చింది. ఇటీవల హుస్నాబాద్‌లో నిషేధిత బీటీ-3 విత్తనాలు పట్టుబడటం కలకలం రేపింది.



ప్రాసెసింగ్‌పై నిఘా పెడతాం..

విత్తన ప్రాసెసింగ్ ప్రక్రియ ఏప్రిల్ మొదటి మొదటి, రెండోవారాల్లో ఊపందుకుంటుంది. దీనిపై నిఘా పెడతాం. ఈసారి కూడా పోలీసుల సహకారంతో టాస్క్‌ఫోర్స్ కమిటీగా ఏర్పడి విత్తన ప్రాసెసింగ్, ప్యాకింగ్‌లో లోపాలు జరగకుండా చూస్తాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

ఆలయ పరిసరాలలో భక్తుల సందడి



మల్లన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. తొమ్మిదవ ఆదివారం ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. పలు జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మరో మూడు వారాల్లో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. శనివారం సాయంత్రం నుంచే మొదలైన భక్తుల రాక ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనానికి బారులుతీరారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, గంగిరేణు చెట్టువద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఈఓ బాలాజీ ఏఈఓలు, ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.

- కొమురవెల్లి(సిద్దిపేట)


స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల కోలాహలం

సామాజిక సేవలో ముందుండాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి
- సిటిజన్స్ క్లబ్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

గజ్వేల్: సామాజిక సేవా కార్యక్రమాల్లో సిటిజన్స్ క్లబ్ ముందుండాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం క్లబ్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ గజ్వేల్‌లో సిటిజన్స్ క్లబ్‌కు మూడు దశాబ్దాలకుపైగా చరిత్ర ఉందని చెప్పారు. వివిధ రంగాలకు చెందిన వారు, రాజకీయ నాయకులు ఒక సమూహంగా ఏర్పాటై సంస్థను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ క్లబ్‌లు రాజకీయాలకతీతంగా నిర్వహించాల్సిన అవసరముందని చెప్పారు. సభ్యులు తరుచూ వివిధ కార్యక్రమాల పేరిట కలవడం ద్వారా సంఘటితత్వం పెరుగుతుందన్నారు. క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ వచ్చారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన నాయిని యాదగిరితోపాటు ఉపాధ్యక్షుడు నల్ల రాము, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి భూపాల్‌రెడ్డి, కోశాధికారి సుధగాని మల్లయ్యగౌడ్, క్రీడల కార్యదర్శి గంగా నరేష్ తదితరులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి సైతం పాల్గొని ప్రసంగించారు.


యాదగిరిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తదితరులు

ఎన్నికల పర్వం.. ఓటరు సంకల్పం

మెదక్: 'ప్రియమైన అమ్మా నాన్న మీరు నన్ను ఎంతగా ప్రేమిస్తున్నారో నాకు తెలుసు. నా భవిష్యత్ బాగుండాలని రాత్రి, పగలు కష్టపడి బాగా చూసుకుంటున్నారు. నా భవిష్యత్ మన దేశ ప్రజాస్వామ్యంతో ముడిపడి ఉంది. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తప్పకుండా ఓటు వేస్తారని కోరుతున్నాను'. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి కలెక్టర్ రాజర్షిషా విద్యార్థి హామీ పత్రాలను తయారు చేసి 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందజేశారు. దీంతో జిల్లాలో పోలింగ్ గణనీయంగా పెరిగింది. జిల్లావ్యాప్తంగా 86.96 శాతం నమోదై రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది. దీనిని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి స్వీకరించి నేడు రాష్ట్రవ్యాప్తంగా 'తెలంగాణ ఓటరు సంకల్ప పత్రం' ముద్రించి అన్ని పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్నారు.

విస్తృత అవగాహన

మే 13వ తేదీన లోక్‌సభ ఎన్నికలు ఉండడంతో ఎన్నికల అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు మెదక్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఓటరు సంకల్ప పత్రం అందజేస్తున్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా మంచి నాయకుడిని ఎన్నుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు సంబంధించి సంకల్పం తీసుకున్నట్లు ఆ పత్రంలో పొందుపర్చారు. పత్రాన్ని తల్లిదండ్రులకు ఇచ్చి వారికి ఇందులో ఉన్న సారాంశం వివరించి వారి సంతకాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆ పత్రాలను తిరిగి అధికారులు స్వీకరిస్తారు.


విద్యార్థుల చేతుల్లో ఓటరు సంకల్ప పత్రాలు

ఓటు నమోదుకు అవకాశం

లోక్‌సభ ఎన్నికల నగారా మోగింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇందుకోసం బీఎల్ఓలు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నారు.

క్లుప్తంగా

కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో కరాటే మాస్టర్లు

నర్సాపూర్ : రెంజుకి కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లల పార్కులో పోటీలు నిర్వహించారు. కరాటే ఎగ్జామినర్ నగేశ్ మాస్టర్, అశోక్, నవీన్, దినకర్, ప్రసన్న భూపాల్ తదితరుల ఆధ్వర్యంలో సుమారు 50 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పలు రకాల బెల్టులు ప్రదానం చేశారు.

ఇంటర్ జోడో..

కరాటేలో రాణించిన విద్యార్థులు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మాస్టర్లు


మనోహరాబాద్(తూప్రాన్): మెదక్‌లో ఎవరెస్ట్ మార్షల్ ఆధ్వర్యంలో ఇంటర్ జోడో కరాటే పోటీలను నిర్వహించగా ఈ పోటీలలో కాళ్లకల్ సన్‌షైన్ షాటోకాన్ కరాటే క్లబ్‌కు చెందిన 55 మంది విద్యార్థులు ఆదివారం పాల్గొని రాణించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నత్తి మల్లేశ్ విద్యార్థులకు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్లు గాజుల మహేశ్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వలస కూలీ మృతి

కొండపాక(గజ్వేల్): అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి చెందిన ఘటన మల్లన్న సాగర్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కుషి జిల్లాకు చెందిన బరహాన్ ప్రసాద్(48), అతడి బామ్మర్ది విదేశీ ప్రసాద్‌తో కలిసి తిప్పారం శివారులోని మల్లన్న సాగర్ సమీపంలో గల మంచి నీటి పంపింగ్ ప్లాంట్‌లో మెగా కంపెనీ వద్ద కూలీగా పని చేస్తున్నారు. బరహాన్ ఆదివారం తెల్లవారుజామున ప్లాంట్ వద్ద అకస్మాత్తుగా పడిపోయి ఉండటాన్ని గుర్తించిన విదేశీ ప్రసాద్, ఇతర కూలీలు హుటాహుటినా గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బరహాన్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విదేశీ ప్రసాద్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సర్కారు ‘వాత్సల్య’ం

అభాగ్య బాలలకు కేంద్రం భరోసా
- ‘మిషన్ వాత్సల్య’ పేరుతో సరికొత్త పథకం
- విద్య, వైద్యం కింద రూ.4 వేల ఉపకార వేతనం
- అంగన్‌వాడీల్లో దరఖాస్తులు
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



సదాశివపేట రూరల్(సంగారెడ్డి)

అభాగ్యులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మిషన్ వాత్సల్య పేరుతో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో దీన్ని అమలు చేసేందుకు ముందుకొచ్చింది. కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టిన ఈ పథకం ద్వారా పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున అందనుంది. 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు దీనికి అర్హులు. ఒకే కుటుంబంలో ఇద్దరు పిల్లలున్నా దీనికి అర్హులు. విధి వంచిత బాలలు పేదరికం కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.

అనాథలు, అభాగ్యులు బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం 2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలకార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, హెచ్ఐవీ బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థికసాయం అందించనున్నారు.

అర్హులెవరంటే..

ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కొన్ని పరిమితులను ప్రభుత్వం పొందుపరిచింది. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించరాదు. 18 ఏళ్ల లోపు ఉన్న బాలలు దీనికి అర్హులు. బాలల సంక్షేమ కమిటీ లిఖిత పూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్‌ను పొడిగించవచ్చు. స్పాన్సర్‌షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతి గృహం, బాలల సదనంలో చేర్పించిన తర్వాత సహాయాన్ని నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలు మినహా పాఠశాలలకు వెళ్లేవారు. పాఠశాల హాజరు సక్రమంగా లేదని తేలినా అధికారులు పరిశీలించి సాయాన్ని నిలిపివేస్తారు.

దరఖాస్తుల పరిశీలన ఇలా..

అర్హులు దరఖాస్తు ఫారమ్ నింపి, అవసరమైన పత్రాలు జత చేసి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇవ్వాలి. వీటిని సీడీపీవో కార్యాలయానికి పంపిస్తారు. దరఖాస్తులన్నింటినీ మండల స్థాయి స్క్రూటింగ్ కమిటీ (తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీవో, ఐసీడీఎస్ సూపర్ వైజర్‌తో కూడిన బృందం) సభ్యులు నిశితంగా పరిశీలిస్తారు. నిబంధనల మేరకు అర్హత కలిగిన దరఖాస్తులను ఎంపిక చేసి ప్రతీ దరఖాస్తుపై కమిటీ సభ్యులు సంతకం చేస్తారు. అనంతరం సదరు సమావేశం మినిట్స్‌తో పాటు దరఖాస్తులన్నింటినీ జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయానికి పంపిస్తారు. వాత్సల్య పథకం ఎంపిక కోసం స్పాన్సర్‌షిప్ అండ్ ఫోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ (ఎస్ఎఫ్‌సీఏసీ) ఉంటుంది. కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ ఉంటారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు.

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు..
- బాలుడి/బాలిక జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు
- తల్లి, తండ్రి ఆధార్‌కార్డులు, మరణ ధ్రువీకరణ పత్రం
- సంరక్షకుడు (గార్డియన్) ఆధార్‌కార్డు
- రేషన్ కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- బాలుడు, బాలిక పాస్‌పోర్టు సైజు ఫొటో
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- బ్యాంకు అకౌంట్ వివరాలు లేదా బాలుడు/బాలిక వ్యక్తిగత అకౌంట్

సద్వినియోగం చేసుకోవాలి

అర్హత కలిగిన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో మిషన్ వాత్సల్య పథకం ద్వారా 240 మందికి సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేశాం. ఇంకా కొత్త వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి. దీనికి ఎలాంటి గడువు లేదు. దరఖాస్తులు రాగానే ప్రభుత్వానికి పంపిస్తాం. వచ్చిన దరఖాస్తులను స్పాన్సర్‌షిప్ అండ్ ఫోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ స్క్రూటినీ చేసి అర్హులను ఎంపిక చేస్తారు.

– లలిత కుమారి, ఐసీడీఎస్ పీడీ, సంగారెడ్డి జిల్లా



పాత కలెక్టరేట్ ఎదుట ఫుట్‌పాత్‌పై పుచ్చకాయల వ్యాపారం

ఫుట్‌పాత్.. హాంఫట్

ఒక పక్క వాహనాల రద్దీ, మరో పక్క ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు.. దీంతో పాదాచారులు నడవడానికి వీల్లేకుండా పోయింది. సిద్దిపేట పట్టణంలోని ప్రధాన రహదారులపై ఉన్న ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమిస్తున్నారని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. నడటానికి నిర్మించిన ఫుట్‌పాత్‌లను సొంత లాభాల కోసం వాటిపై పండ్లు, టిఫిన్ సెంటర్లు, ఐరన్ వస్తువులు తదితర సామగ్రి పెట్టి రాకపోకలు లేకుండా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని పాదచారులు వాపోయారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



ఫుట్‌పాత్‌పై వస్తువులు



హౌసింగ్ బోర్డు వద్ద టిఫిన్ సెంటర్



ఐరన్ వస్తువులు



దుకాణాల ఎదుట ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్

ముగిసిన ఆటల పోటీలు



విజేతలు మోజర్ల హార్టికల్చర్ కళాశాల విద్యార్థులు



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

ములుగు(గజ్వేల్): సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన 3వ అంతర కళాశాల క్రీడలు ఆదివారం ముగిశాయి. మహిళలు, పురుషులకు 15 క్రీడా విభాగాల్లో పోటీలను నిర్వహించగా, విద్యార్థులకు 20 రకాలైన అథ్లెటిక్స్, 18 రకాలైన సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. పోటీల్లో మోజర్ల హార్టికల్చర్ కళాశాల బాలురు వాలీబాల్ విభాగంలో గెలుపొందగా, ఖోఖో, నాటిక, వన్‌యాక్ట్ ప్లే విభాగాల్లో ప్రథమ స్థానంలో గెలుపొందారు. క్యారమ్స్ మహిళా విభాగంలో ములుగుకు చెందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హార్టికల్చర్ సైన్సెస్ విద్యార్థులు మొదటి స్థానంలో గెలుపొందగా, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో బాలురు ద్వితీయ స్థానంలో నిలిచారు. అటవీకళాశాల పరిశోధన కేంద్రంకు చెందిన బాలురు క్రికెట్‌లో గెలుపొందగా, కబడ్డీలో బాలికలు మొదటి స్థానంలో నిలిచారు. రాజేంద్రనగర్ హార్టికల్చర్ విద్యార్థులు బాలురు, బాలికలు బాస్కెట్ విభాగంలో, క్లే మోడలింగ్‌లో ప్రథమ స్థానంలో గెలిపొందారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దేవరపల్లి కనకరత్నం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల అధికారులు విజయ, ప్రశాంత్, చీనా నాయక్, పిడిగం సైదయ్య, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగశాలలకు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రచార కరదీపికను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

- ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్
- నేడు కళాశాలలో రోబోటిక్స్ ప్రదర్శన

సిద్దిపేటఎడ్యుకేషన్: నూతన ఆలోచనలతో విభిన్న ఫలితాలను సాధించేందుకు ఆవిష్కరణ ప్రయోగశాలలు ఎంతగానో ఉపయోగపడుతాయని సిద్దిపేట ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న రోబోటిక్స్ ప్రదర్శన కార్యక్రమ ప్రచార కరదీపికను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సోహం అకాడమీ సౌజన్యంతో రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా ఆవిష్కరణ ప్రయోగశాలను కళాశాలలో గతంలోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో ప్రతీ విద్యార్థికి ఇలాంటి ప్రయోగశాలలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. రెండేళ్లుగా చాలా మంది విద్యార్థులను నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించినట్లు వివరించారు. రోబోటిక్స్‌పై జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వర్క్‌షాపులు నిర్వహించామన్నారు. కళాశాల విద్యార్థుల మార్గదర్శకంలో పాఠశాలల విద్యార్థులు రూపొందించిన రోబోటిక్స్‌ను సోమవారం కళాశాలలో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని రూపొందించిన కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సీహెచ్ మధుసూదన్, ఫిజిక్స్ అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, పరీక్షల విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ గోపాల సుదర్శనం, అధ్యాపకులు డాక్టర్ మహేశ్, భైరయ్య, కృష్ణయ్య, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను తొలగించాలి



మాట్లాడుతున్న అప్పాలకృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నిబంధనలకు విరుద్ధంగా పని చేసిన ఇంటర్ అధ్యాపకులను విధుల నుంచి తొలగించాలని ఏఐపీఎస్‌యూ జిల్లా నాయకుడు అప్పాలకృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా చిన్నకోడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకులు, జూనియర్ అసిస్టెంట్లు ని బంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహించారన్నారు. ఈ విషయం జిల్లా ఇంటర్ విద్యాధికా రి సూర్యప్రకాశ్‌కు తెలిపినా స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌యూ రవి, ప్రవీణ్, మధు, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిన్న బీజేపీ.. నేడు బీఆర్ఎస్



బీజేపీ కండువా కప్పుతున్న బీబీ పాటిల్



బీఆర్ఎస్‌లో చేరుతున్న నందుపటేల్

ఒక్క రోజులోనే సొంత గూటికి

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో అప్పుడే రాజకీయాలు వేడెక్కాయి. వివిధ పార్టీల నాయకులు ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపుతున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన నాగలిగిద్ద మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందుపటేల్, కారాముగి మాజీ సర్పంచ్ రవికుమార్ తమ అనుచరులతో కలిసి శనివారం సాయంత్రం జహీరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఒక్క రోజు గడవక ముందే వారు తిరిగి సొంత గూటికి చేరారు. ఆదివారం ఉదయం ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్ కండువాలు కప్పి తిరిగి పార్టీలో చేర్చుకున్నారు. వీరి వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కోతులను తప్పించబోయి..

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



చికిత్స పొందుతున్న రాజకళ

చిన్నకోడూరు (సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలైన ఘటన మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ శివారులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణానికి చెందిన చామంతుల భిక్షపతి, రాజకళ దంపతులు బైక్ పై కోహెడ వెళ్లి, తిరిగి సిద్దిపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో ఇబ్రహీంనగర్ శివారులోకి రాగానే కోతులు బైక్‌కు అడ్డు వచ్చాయి. కోతులను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.



గాయాలతో మల్లేశం

నిజాంపేట(మెదక్): బైక్ అదుపుతప్పి బోల్తా పడటంతో దంపతులకు గాయాలైన ఘటన నిజాంపేట మండలంలోని నగరం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని ఆకారం గ్రామానికి చెందిన బోయ మల్లేశం, ప్రమీల దంపతులు నస్కల్ రోడ్డు నుంచి నగరం గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో బైక్ అదుపుతప్పి పడిపోయారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల ద్వారా సమా చారం అందుకున్న రామాయంపేట 108 సిబ్బంది క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

- మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం

తూప్రాన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్ట్ షాపులపై పోలీసులు దాడి చేసిన ఘటన మండలంలోని యావపూర్‌లో చోటు చేసుకుంది. దాడులపై ఎస్ఐ శివానందం మాట్లాడుతూ.. యావపూర్ గ్రామానికి సురేందర్‌రెడ్డి, నాగరాజు అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఇందులో రూ.20 వేల విలువైన 43 బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం



పిల్లలతో తల్లి సంగీత

జిన్నారం(పటాన్‌చెరు): ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దోమడుగులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. రాజస్థాన్‌లోని పాలి జిల్లా, ప్రతాప్‌ఘడ్ గ్రామానికి చెందిన సంగీత భర్తతో కలిసి రెండేళ్ల నుంచి దోమడుగు గ్రామంలో నివాసం ఉంటూ విగ్రహాలను తయారు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. సంగీతకు ప్రవీణ్, సుందరీ ఇద్దరు సంతానం. ఈనెల 14న రాత్రి నుంచి తల్లితోపాటు ఇద్దరు పిల్లలకు కనిపించడం లేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. సంగీత తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య



కిరణ్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కౌడిపల్లి గ్రామానికి చెందిన గుడ్డముల సత్తమ్మకు ఇద్దరు కుమారులు. భర్త గతంలో చనిపోయాడు. పెద్ద కుమారుడు కిరణ్(21) మద్యానికి బానిసై పనిచేయకుండా తిరుగుతున్నాడు. మద్యం తాగేందుకు ప్రతి రోజూ తల్లిని డబ్బులు అడిగి వేధించేవాడు. నాలుగు రోజుల కిందట తల్లి సత్తమ్మ, చిన్న కుమారుడితో కలిసి వేరే గ్రామానికి బంధువుల వద్దకు వెళ్లింది. శనివారం రాత్రి పెద్ద కుమారుడు కిరణ్ తనకు డబ్బులు ఇవ్వాలని లేకపోతే చనిపోతానని ఫోన్ చేసి బెదిరించాడు. తల్లి తన వద్ద లేవని చెప్పి ఫోన్ పెట్టేసింది. ఆదివారం ఉదయం ఊరి నుంచి ఇంటికి వచ్చి చూడగా ఉరి వేసుకొని కిరణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

మునిపల్లి(అందోల్): బైక్‌పై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని లింగంపల్లి గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. బుదేరా ఎస్ఐ సురేశ్ కథనం మేరకు.. కర్నాటక చించోలి మండలం శ్రీ నగర్ తండాకు చెందిన పరశురాం రాథోడ్, జ్యోతి (23) జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. లింగంపల్లి గ్రామ శివారులోకి రాగానే వెనుక నుంచి మరో బైక్‌పై వస్తున్న ఎజాజ్ అనే వ్యక్తి అతివేగంగా వచ్చి పరశురాం బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న జ్యోతి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందింది. పరశురాం రాథోడ్, ఎజాజ్‌కు గాయాలయ్యాయి. మృతురాలి భర్త పరశురాం ఫిర్యాదుతో ఎజాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. మృతురాలికి బాబు, పాప ఉన్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



బాలమల్లు మృతదేహం

నిజాంపేట(మెదక్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన ఆదివారం నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన బక్కోల్ల బాలమల్లు(44) ఆదివారం ఉదయం రోజు మాదిరిగానే వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలం గట్ల వెంబడి తిరుగుతున్న క్రమంలో అప్పటికే గట్లపై తెగి పడిన విద్యుత్ వైరును గమనించకుండా వెళ్లడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఎల్లవ్వ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులకు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే బాలమల్లు మృతి చెందాడని రైతులు ఆరోపిస్తున్నారు. 11 కేవీ విద్యుత్ వై ర్లు నాసిరకంగా ఉందని పలుమార్లు అధికారులకు విన్నవించినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.